దావత్‌లో లిక్కర్‌పై ఎక్సైజ్ నజర్

ఎన్డీపీఎల్ కోసం సరిహద్దుల్లో డ్రైవ్‌లు • 4 నెలల్లో 302 కేసులు

అక్రమ మద్యం తెస్తే చర్యలు • ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరిక

ఓ ప్రైవేట్‌పార్టీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్‌అధికారులు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : దావత్‌లలో 'సిట్టింగ్' వేయాలంటే ఇక తప్పనిసరిగా ఎక్సైజ్‌శాఖ అనుమతి తీసుకోవాల్సిందే! అక్కడ ఏదైనా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) కనిపిస్తే ఉపేక్షించేది లేదని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం హెచ్చరించింది. విదేశాల నుంచో, ఇతర రాష్ట్రాల నుంచో మద్యం అక్రమంగా తెచ్చి ఫంక్షన్లు చేసినా, ప్రైవేట్ పార్టీలు పెట్టుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు పెరుగుతుండడంతో ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫంక్షన్లు, పార్టీలు జరిగినా అక్కడ 'సిట్టింగ్' ఆప్షన్ ఉంటే తప్పనిసరిగా మఫ్టీలో నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, 100 నుంచి 200 మంది ఆపై హాజరయ్యే ప్రతి ఫంక్షన్‌లోనూ తప్పనిసరిగా నిఘా పెట్టాలని సూచించారు.

సిట్టింగ్‌కు పర్మిషన్ తీసుకోవాలి

ఫంక్షన్లలో మద్యం సిట్టింగ్ కావాలంటే పర్మిషన్ తీసుకోవాలి. ఎక్కన్నుంచో మద్యం దొంగచాటుగా తీసుకొస్తే ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఏడు ఏప్రిల్ వరకు 302 కేసులు నమోదు చేశాం. 165 మందిని అదుపులోకి తీసుకున్నాం. 35 వాహనాలు సీజ్ చేసి, 61.13 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశాం. ఇకనుంచి స్పెషల్ డ్రైవ్‌లపై దృష్టిపెట్టాలి. లేకపోతే అధికారులపై చర్యలు తప్పవు.

- వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

మద్యం మత్తు ఖరీదు 3,321 కోట్లు

- **లిక్కర్ అమ్మకాల్లో రికార్డు దిశగా తెలంగాణ**
- **వాణిజ్య, సేల్స్ ట్యాక్స్ తరువాత ఆబ్కారీదే హవా**
- **తాజాగా వెల్లడించిన కాగ్ నివేదిక**

హైదరాబాద్ , జూలై 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఖజానాను నింపుకోవడానికి రాష్ట్ర ప్రజలను మత్తులో ముంచుతున్నది. మద్యం అమ్మకాల ద్వారా గత ఏడాది కన్నా రూ.11 వేల కోట్లు అధికంగా.. ఈ ఏడాది రూ.45 వేల కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ సర్కార్.. ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. ఇందుకు తాజాగా కాగ్ వెల్లడించిన గణాంకాలు అద్దం పడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 తొలి నెల ఏప్రిల్‌లో రాష్ట్రానికి మద్యం అమ్మకాల ద్వారా రూ.1,580 కోట్లు, మేలో రూ.3,321 కోట్లు వచ్చినట్టు కాగ్ రిపోర్టు వెల్లడించింది. జూన్‌లో రూ.1,342 కోట్ల ఆదాయం వచ్చినట్టు సమాచారం. మద్యం అమ్మకాల నుంచి ఎక్సైజ్‌శాఖకు ప్రతినెలా సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఆదాయం వస్తున్నది. ఆరు నెల్లోనే రూ.23 వేల కోట్లు ఆదాయం సమకూరినట్టు తెలిసింది.

రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం సంవత్సరాలవారీగా



లోకం పోకడ

ఈ రోజు మీకు ఘుమఘుమలాడే లంచ్ మన ప్రభుత్వ హాస్టల్ నుంచి తెప్పించాం సార్!

కంప్యూటర్ పరీక్షలో పాసైతేనే డ్రైవింగ్ లైసెన్స్

కొత్తగా ఆటోమెటిక్ పద్ధతిలో పరీక్ష • అడ్డదారుల్లో లైసెన్స్ పొందేవారికి చెక్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): డ్రైవింగ్ లైసెన్సుల జారీలో అక్రమాలకు, అడ్డదారిలో లైసెన్సులు పొందేవారికి చెక్ పెట్టేందుకు ఆర్టీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను ఆధునీకరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతున్న పరీక్షను తొలగించి, మరింత ప్రామాణికమైన ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇకపై లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. రహదారులపై నిత్యం ఎదురయ్యే సమస్యలను కొత్త పద్ధతిలో టెస్ట్ ట్రాక్‌పై కృత్రిమంగా కల్పిస్తారు. పరీక్షలో భాగంగా ఆ ట్రాక్‌పై వాహనం నడిపినప్పుడు కంప్యూటర్‌లో రికార్డు అవుతుంది. దీంతో సక్రమంగా వాహనం నడిపినవారికే లైసెన్సు లభిస్తుంది. డ్రైవింగ్‌లో ఏ చిన్న తప్పు చేసినా పరీక్షలో ఫెయిల్ అయినట్టే.

లైసెన్స్ జారీకి కొత్త పద్ధతులు ఇవీ..

- ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్‌లో 5 ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.
- ముందుగా 'హెచ్' ట్రాక్‌లో వాహనాన్ని రివర్స్ చేయాల్సి ఉంటుంది.
- ఆ తర్వాత 'ఎస్' ట్రాక్‌లో వాహనాన్ని ఒక మూల నుంచి మరో మూలకు టర్న్ చేయాలి.
- చివరగా మలుపులు, ఎత్తుపల్లాలు, గతుకులతో ఉండే 'కే' ట్రాక్‌లో వాహనాన్ని నడిపి, సక్రమంగా పార్క్ చేసిచూపాలి.
- ట్రాఫిక్ నిబంధనల ప్రకారం టూవీలర్ డ్రైవర్ హెల్మెట్, ఫోర్‌వీలర్ డ్రైవర్ సీటుబెల్ట్ పెట్టుకోవాలి. ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్‌లో రికార్డవుతుంది.
- వాహనాన్ని నడిపేటప్పుడు ఎలాంటి పొరపాట్లు చేసినా టెస్టులో ఫెయిల్ అయినట్టు కంప్యూటర్‌లో చూపిస్తుంది.
- పరీక్షలో ఫెయిలైన వారిని మరో నెల రోజులు శిక్షణ తీసుకుని మళ్లీ టెస్టుకు రమ్మంటారు.

రాష్ట్రంలో డెంగ్యూ విజృంభణ

- **ఆరున్నర నెలల్లోనే 1078 కేసులు**
- **గతేడాదితో పోల్చితే 52 % పెరుగుదల**
- **డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించినా పట్టని ప్రభుత్వం**
- **దోమల నివారణపై దృష్టిపెట్టని యంత్రాంగం**
- **గ్రామాలు, పట్టణాల్లో పడకేసిన పారిశుధ్యం**



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డెంగ్యూ విజృంభిస్తున్నది. ఏడు నెలల్లోనే కేసుల సంఖ్య వెయ్యి దాటింది. డెంగ్యూని నియంత్రించాలంటే దోమల నివారణ చర్యలతోపాటు ట్రాకింగ్, టెస్టింగ్, ట్రీటింగ్ కోసం దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యంపైగానీ, దోమల నివారణపైగానీ, వైద్యారోగ్యశాఖ దవాఖానల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 'దోమల నివారణకు చర్యలు తీసుకోండి' అంటూ హడావుడి సమీక్షలు, ఆదేశాలు, ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో డెంగ్యూ కేసులు పెరుగుతాయని స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థే ఇటీవల హెచ్చరిక జారీ చేసింది. డెంగ్యూలోని నాలుగు ప్రధాన వేరియంట్లు డీఈఎన్వీ-1, డీఈఎన్వీ-2, డీఈఎన్వీ-3, డీఈఎన్వీ-4 రాష్ట్రంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో డెంగ్యూ కేసులు భారీగా నమోదవుతున్నాయి.

సగంకన్నా ఎక్కువ..

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో 1078 డెంగ్యూ కేసులు నమోదైనట్టు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇది అధికారికంగా చెప్పిన లెక్కలు మాత్రమే. అనేక ప్రైవేట్ దవాఖానలు డెంగ్యూ కేసులను రిపోర్ట్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు 706 కేసులు నమోదైనట్టు గణాంకాలు చెప్తున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి 52 శాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. రాష్ట్రంలో మలేరియా కూడా విజృంభిస్తున్నది. ఈ ఏడాది ఇప్పటివరకు 78 మలేరియా కేసులు నమోదయ్యాయి.

పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలకు ప్రతి నెల నిధులు విడుదల చేయలేదు. ఏడు నెలల్లోనే దాదాపు రూ.3వేల కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు చెప్తున్నారు. పల్లెల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనలేని పరిస్థితి నెలకొన్నదనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య లోపంతో దోమలు పెరిగిపోతున్నాయని చెప్తున్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో గోళీల్లేవ్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు వచ్చిన ఆరునెలల్లోనే ప్రభుత్వ దవాఖానాల్లో మందు గోళీలు కూడా దొరకని దుస్థితి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నారు. పాలన గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. సర్కారు వైద్యానికి కేసీఆర్ ప్రభుత్వం జవసత్వాలు ఇచ్చి, పోదాం పదరో సర్కారు దవాఖానాకు అనే ధీమానిచ్చిందని చెప్పారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	24.7°c
మెదక్	36.2°c	22.9°c
నిజామాబాద్	34.0°c	25.9°c
రంగారెడ్డి	33.7°c	22.2°c
హైదరాబాద్	32.2°c	24.5°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	31.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	22.0°c
ఖమ్మం	30.0°c	25.0°c
మహబూబ్‌నగర్	29.6°c	23.3°c

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం ఖమ్మం జిల్లా వైరాలో అత్యధికంగా 5.04 సెం.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో రానున్న రెండు వారాలు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అన్నారం బరాజ్‌లో 75 శాతం పరీక్షలు పూర్తి

జయశంకర్ భూపాలపల్లి, జూలై 12 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో చేపట్టిన టెస్టింగ్ పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఎన్‌డీఎస్ఏ, నిపుణుల కమిటీ ఆదేశాల మేరకు సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం అన్నారం బరాజ్‌లో 40 రోజులుగా పరీక్షలు నిర్వహిస్తున్నది. వరద తాకిడి పెరగడంతో పరీక్షలకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం అన్నారం బరాజ్ అప్ స్ట్రీమ్‌లో 21 టెస్టులకు గాను 21, డ్రిల్లింగ్, డౌన్ స్ట్రీమ్‌లో 21 టెస్టులకు గాను 8, 11 డ్రిల్లింగ్ పనులు పూర్తయ్యాయి. మొత్తం 75 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. అన్నారం బరాజ్ నుంచి రోజుకు 3 టీఎంసీల నీరు వృథాగా పోతున్నది. కనీసం టీఎంసీ నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా సుందిళ్ల బరాజ్‌కు లిఫ్ట్ చేస్తే రైతులకు కొంత ఉపశమనం కలిగేదని విశ్లేషకులు చెబుతున్నారు. 2021లో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో సీ పేజ్‌లు ఏర్పడగా కెమికల్ గ్రౌటింగ్ చేసి రైతులకు సాగు నీరు అందించారు. ప్రస్తుతం నీరు లేక రైతులు నార్లు పోసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మేడిగడ్డకు వరద

మహదేవపూర్/కన్నాయిగూడెం, జూలై 12 : మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు శుక్రవారం ఇన్‌ఫ్లో 43,500 క్యూసెక్కుల రాగా, ఎనిమిది బ్లాక్‌లలోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతున్నది. శుక్రవారం ఎగువ నుంచి 64,350 క్యూసెక్కుల వరద వచ్చినట్టు అధికారులు తెలిపారు.

రైతన్నల బలవన్మరణం

మొదటిపేజీ తరువాయి...

పంటను కాపాడుకోవడం కష్టంగా మారింది. ఐదు బోర్లు వేసినా నీరు అడుగంటడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వ్యవసాయం కోసం చేసిన రూ.5 లక్షల అప్పులు తీర్చే మార్గం కన్పించక బుధవారం తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. పక్క పొలం రైతులు గమనించి రమేశ్‌ను వెంటనే చికిత్స కోసం దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, గురువారం రాత్రి మృతిచెందాడు. రమేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

జనగామ జిల్లాలో కౌలు రైతు..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య (55)కు సొంతంగా భూమి లేకపోవడంతో కొంత వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. కూతురు పెండ్లితోపాటు వ్యవసాయ పెట్టుబడి కోసం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మయ్య ఈ నెల 9న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలో ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

నేతన్న ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పవర్‌లూమ్ పెట్టుబడుల కోసం, పెద్ద కూతురి పెండ్లి కోసం శంకరయ్య రూ.7 లక్షల వరకు అప్పు చేశాడు. కొంతకాలంగా పనులు లేకపోవడం, ఉపాధి అంతంతమాత్రంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారడం, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతుండటంతో మనస్తాపానికి గురై శుక్రవారం గ్రామ శివారులోని సత్యనారాయణపురం సమీపంలో వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరయ్య కుమారుడు ప్రణీత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు కట్టంగూర్ ఎస్సై ఎన్ శ్రీను తెలిపారు.

పాలిటెక్నిక్‌లో మరో 8,748 సీట్లు ఖాళీ

ముగిసిన తుది విడత వెబ్ కౌన్సెలింగ్

మొత్తంగా 70.46% సీట్ల భర్తీ

16 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం

18 నుంచి ఫస్టియర్ క్లాసులు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత మరో 8,748 సీట్లు భర్తీ కాకుండా మిగిలాయి. ప్రైవేట్ కాలేజీలతో పోల్చితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోనే అత్యధిక సీట్లు భర్తీకావడం విశేషం. ప్రభుత్వ కాలేజీల్లో 13వేలకు సీట్లుంటే 11వేల సీట్లు భర్తీకాగా, ప్రైవేట్ కాలేజీల్లో 15వేల సీట్లుంటే 9వేలకు పైగా సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ఒక ప్రైవేట్ కాలేజీలో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. పాలిటెక్నిక్ తుది విడత సీట్లను శుక్రవారం కేటాయించగా, రెండు విడతల్లో మొత్తంగా 29, 610సీట్లకు, 20,862 (70.46%) సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు 15లోగా ఫీజు చెల్లించాలని, 16లోగా కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. కోర్సుల వారీగా తీసుకుంటే సీఎస్ఈలో 82% సీట్లు భర్తీకాగా, ఆ తర్వాత ఈసీఈలో 80% చొప్పున భర్తీ అయ్యాయి. పాలిటెక్నిక్ ఫస్టియర్ క్లాసులు 18 నుంచి ప్రారంభంకానున్నాయి. 15, 16 తేదీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్‌ను నిర్వహించి, 18 నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులను ప్రారంభిస్తారు.

కోర్సు	సీట్లు	భర్తీఅయినవి(%)
సీఎస్ఈ	6,796	5,584 (82%)
ఈసీఈ	5,847	4,691 (80%)
ఈఈఈ	5,881	3,803 (65%)
సివిల్	4,058	2,590 (64%)
మెకానికల్	4,107	2,224 (54%)

టైప్ రైటింగ్‌కు టాటా!

- **ఈ ఏడాదే పరీక్షలు ఆఖరు**
- **ఉద్యోగాల భర్తీకి నో..**
- **ఇక నుంచి కంప్యూటర్ టైపు బేస్డ్ ఎగ్జామ్స్**
- **వ్యతిరేకిస్తున్న టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లు**

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఎంతో మందికి టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగావకాశాలు, ఉపాధి కల్పించిన 200 ఏండ్లకు పైగా చరిత్ర గల టైప్ రైటింగ్ కోర్సులు ఇక కాలగర్భంలో కలవనున్నాయి. ఈ కోర్సులను మూసివేసే దిశలో సాంకేతిక విద్యాశాఖ అడుగులేస్తున్నది. టైప్ రైటింగ్ పరీక్షల స్థానంలో ఇక నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీటీబీ) పద్ధతిలో పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇదే జరిగితే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కోర్టుల్లో ప్రతీ ఏటా భర్తీచేసే వేలాది టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు మన విద్యార్థులు పోటీపడే అవకాశాన్ని కోల్పోనున్నారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వ శాఖల్లో టైప్‌రైటర్లు, స్టెనోగ్రాఫర్ పోస్టులు భర్తీచేయడంలేదు. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను మాత్రమే భర్తీచేస్తున్నారు. దీంతో టైప్ రైటింగ్ కోర్సులు అనవసరమన్న భావనతోనే మూసివేస్తున్నారు. దీనిని టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

తమిళనాడు తరహాలో ప్రోత్సహించాలని డిమాండ్

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలను సాంకేతిక విద్యామండలి(ఎస్‌బీటెట్) ఏటా జూలై, డిసెంబర్‌లో నిర్వహిస్తున్నది. ఇవి పూర్తిగా సర్టిఫికెట్ కోర్సులు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 350 టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూషన్లున్నాయి. మరో 50 వరకు గుర్తింపులేకుండా నడుస్తున్నాయి. ప్రతి ఏడాది 4వేల మంది టైప్ రైటింగ్, వెయ్యి మంది షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు హాజరవుతున్నారు. తమిళనాడు తరహాలో ఈ కోర్సులను ప్రోత్సహించాలని ఇన్‌స్టిట్యూట్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. తమిళనాడులో పదో తరగతిలోపే ప్రీ జూనియర్ అనే నూతన విధానాన్ని అమలుచేస్తున్నారు. టైప్‌రైటింగ్‌కు సమాంతరంగా కంప్యూటర్ కోర్సుల్లోనూ విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు.

ఎస్సెస్సీ, కోర్టుల్లో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం

టైప్ మిషన్లపై ప్రాక్టీస్ చేస్తేనే స్పీడ్, కచ్చితత్వం మెరుగవుతుంది. మన దగ్గర టైప్‌రైటింగ్ ఉద్యోగాలు లేవంటున్నారు. మరీ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కోర్టుల్లో స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీచేస్తున్నారు కదా? ఈ కోర్సులను రద్దుచేస్తే, పరీక్షలను నిర్వహించడం ఆపేస్తే మన విద్యార్థులు ఆయా ఉద్యోగాలను కోల్పోరా? సీబీటీ పరీక్షల్లోనూ టైప్‌రైటింగ్ సిలబస్‌నే ఇచ్చారు. ఈ కోర్సులతో వచ్చే నష్టమేంటో అర్థం కావడంలేదు. ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), టైప్‌రైటింగ్ కోర్సులను సమాంతరంగా నిర్వహించాలి. పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలి.

- జీ సతీశ్‌బాబు, తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్

'ఏకలవ్య'లో హర్యానా టీచర్లు

46 పోస్టుల్లో 43మంది వాళ్లే • మరో ముగ్గురూ ఢిల్లీ, రాజస్థాన్ అభ్యర్థులే

- **తెలంగాణ నుంచి ఒక్క అభ్యర్థి కూడా లేరు**
- **దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి**
- **నియామకంపై అనేక అనుమానాలు**

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ఏకలవ్య పాఠశాలల్లో హర్యానా టీచర్లు నియామకం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల 46 పోస్టులను భర్తీ చేయగా, 43 మంది హర్యానాకు చెందిన వాళ్లే ఉండటం ఇందుకు బలం చేకూరుతున్నది. దేశవ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) ఖాళీ పోస్టులను ఇటీవల కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్) భర్తీచేసింది. దేశవ్యాప్తంగా జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ) పోస్టులు 707, బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు 7,702 భర్తీచేసింది. తెలంగాణలోని ఏకలవ్య పాఠశాలల్లో భర్తీ చేసిన 46 పోస్టుల్లో 43 మంది ఒక్క హర్యానాకు చెందినవారే ఉన్నారు. మిగతా ముగ్గురు కూడా ఢిల్లీ నుంచి ఇద్దరు, రాజస్థాన్ నుంచి ఒక అభ్యర్థి ఉన్నారు. 46 పోస్టుల్లో తెలంగాణ నుంచి ఒక్క అభ్యర్థి కూడా లేకపోవడం గమనార్హం. ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిసింది. మొత్తం స్టాఫ్‌లిస్ట్‌లో దక్షిణ భారతదేశం నుంచి ఎవరూ లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. దేశవ్యాప్తంగా 405 ఈఎంఆర్ఎస్ కొనసాగుతుండగా, మరో 708 స్కూళ్లను మంజూరు చేశారు. ఇంకా 32 పాఠశాలలను మంజూరు చేయాల్సి ఉన్నది. ఈఎంఆర్ఎస్‌లలో ఆరు నుంచి 12వ తరగతి వరకు బోధిస్తారు. తెలంగాణవ్యాప్తంగా 23 ఈఎంఆర్ఎస్‌లు ఉన్నాయి.

భూములివ్వం!

మొదటిపేజీ తరువాయి...

ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ తమ గోడు వెల్లబోసుకున్నారు. కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం సర్వే నంబర్ 19లో తాము సాగు చేసుకుంటున్న భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, అధికారులు తమను మూడు నెలల నుంచి ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఏండ్ల నుంచి సాగు చేసుకుంటూ బతుకుతున్నామని చెప్పారు. వారసత్వంగా వ్యవసాయం చేసుకుంటూ ఆ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఇప్పుడు అభివృద్ధి పేరిట ప్రభుత్వం తమ భూములను గుంజుకోవడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. తగిన విలువ కట్టకుండా అరకొర ముట్టజెప్పి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొడంగల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేయడం మంచిదే అయినా పేదలకు న్యాయం చేయకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎకరాకు 10